ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ 'ఆకర్ష్'!

- హస్తం వైపు ముద్దగౌని, మాజీ కార్పొరేటర్ల చూపు
- మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో మంతనాలు
- త్వరలో కాంగ్రెస్ చేరికకు రంగం సిద్ధం

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరగా, మరికొందరు ముఖ్య నేతలు సైతం కారు దిగేందుకు తహతహలాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని ప్రకటించడంతో పలువురు బీఆర్ఎస్ నేతలు ఆమెను కలిసి మద్దతు ప్రకటించినట్టు తెలుస్తోంది. గతంలో మంత్రిగా పనిచేసిన మహేందర్‌రెడ్డికి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలువురు నాయకులు టచ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నియోజకవర్గంలో మహేందర్‌రెడ్డి తన బంధువుల ఇంటికి వచ్చారు. దీంతో పలువురు బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డిని కలిసి మంతనాలు జరిపారు.


కాంగ్రెస్‌లో చేరేందుకు బీఆర్ఎస్ నేతల క్యూ..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పలువురు ఇతర పార్టీ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే తమకు పరిచయం ఉన్న నాయకులతో మంతనాలు జరిపిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యంగా ఎల్‌బీనగర్ మాజీ ఇన్‌చార్జి ముద్దగౌని రాంమోహన్‌గౌడ్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు సామ రమణారెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. వీరంతా పట్నం మహేందర్‌రెడ్డిని కలవడంతో పాటు పార్టీలో చేరడంపై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

◆ మల్కాజిగిరి ఎంపీ సీటు గెలుపును కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఆ పార్టీ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. దీంతో పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులతో ఇప్పటి నుంచే సంప్రదింపులు జరుపుతున్నారు. అన్నీ కుదిరిన తర్వాతే పార్టీలో చేరనున్నట్లు పలువురు బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. వీరంతా బీఆర్ఎస్‌ను వీడితే ఇక ఎల్‌బీనగర్‌లో ఆ పార్టీకి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కావడం.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం పని చేసిన వ్యక్తులే పార్టీని వీడటం చర్చనీయాంశంగా మారింది.

ఎల్‌బీనగర్ ఓటర్లు 5,98,918

- పురుష ఓటర్లు 3,11,311
- మహిళా ఓటర్లు 2,87,474
- ఇతరులు 133 మంది
- యువ ఓటర్లు 10,874
- అత్యధికంగా 30-39 వయస్సుగల ఓటర్లు 1,67,972 మంది



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రస్తుతం ఓటర్లు 5,98,918 మంది ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.నియోజకవర్గంలో వందేళ్ల వయస్సు దాటిన వారు 91 మంది ఉన్నారు. వీరి లో 43 మంది పురుషుడు కాగా, 48 మంది మహిళలు ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుష ఓటర్లు 3,11,311 మంది కాగా.. మహిళా ఓటర్లు 2,87,474 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు 133 మంది ఉన్నారు. వివిధ వయస్సు గల ఓటర్లను పరిశీలిస్తే యువ ఓటర్ల కంటే అత్యధికంగా 30-39 వయస్సు గల వారే అధికంగా ఉన్నారు. యువ ఓటర్లు 10,874 మంది ఉండగా, వీరిలో 30-39 మధ్య వయస్సు వారు 1,67,972 మంది ఉన్నారు.

వయస్సుల వారీ ఓటర్ల వివరాలు ఇలా..

ఏజ్ రేంజ్	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
18-19	5930	4940	4	10,874
20-29	50942	46,504	53	97,499
30-39	84,290	83,639	43	1,67,972
40-49	71,215	66,997	14	1,38,226
50-59	48,440	43,888	7	92, 335
60-69	30,099	25,167	6	55,272
70-79	15,728	12,144	4	27,876
80-89	4,044	3,480	1	7525
90-99	580	667	1	1248
100-109	43	48	0	91
మొత్తం	3,11,311	2,87,474	133	5,98,918

సొంత గూటికి నల్లా రఘుమారెడ్డి

ప్రభుత్వ పథకాలు నచ్చడం వల్లే కాంగ్రెస్‌లో చేరా..



ముఖ్యమంత్రిని సత్కరిస్తున్న రఘుమారెడ్డి తదితరులు

చంపాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చటం వల్లే తాను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లా రఘుమారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నేతలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు రఘుమారెడ్డికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం రఘుమారెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంతరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సీఎంను సత్కరించారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ, తాను గతంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేశానని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్‌నేతలు రంగారెడ్డి, రవీందర్ రెడ్డి, విక్రమ్, విజేందర్ తదితరులు ఉన్నారు.

రాజేందర్‌ను గెలిపించి ప్రధానికి బహుమతిగా ఇవ్వాలి



గడ్డి అన్నారంలో జరిగిన సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల జమున

నాగోలు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి ఈటల జమున కోరారు. ఆదివారం కొత్తపేట డివిజన్ న్యూ మారుతినగర్‌లో మహిళా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జమున మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటేసి మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి బహుమతిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణవేణి, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డిఅన్నారంలో...

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ సరస్వతీనగర్ కాలనీలోని తిరుమల తిరుపతి దేవస్థానం హాల్‌లో ఆదివారం మహిళా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున, స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. మల్కాజిగిరి ఎంపీ స్థానం నుంచి రాజేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, మాజీ కౌన్సిలర్ బండి నిర్మల, సీనియర్ నాయకుడు చిలుకూరి రామ్‌రెడ్డి, ఆనంద్ కుమార్, డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి గోవుల అపహరణ

మన్సూరాబాద్/హస్తినాపురం: గోవులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి అపహరించుకుపోయిన ఘటన మన్సూరాబాద్‌లో ఆదివారం వెలుగు చూసింది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్‌కాలనీ ఫేజ్-1లోని శివాలయం వద్ద తాత్కాలికంగా షెడ్ వేసి కొంత కాలంగా గోశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏడు గోవులు, రెండు లేగ దూడలు ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని దుండగులు వీటికి మత్తు మందు ఇచ్చి మూడు గోవులను అపహరించుకపోయారు. గోశాల నిర్వాహకుడు భీమనపల్లి వెంకటేశం ఆదివారం ఉదయం వచ్చి చూడగా మూడు గోవులు కనిపించలేదు. మరో గోవు మృతి చెంది ఉంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రెండు గోవులతో పాటు లేగ దూడలకు చికిత్స అందించి రక్షించారు. గోశాల నిర్వాహకుడు వెంకటేశం సమాచారం మేరకు వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. దుండగులను గుర్తించి చర్యలు చేపడతామన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోవులను అపహరించిన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోశాల నిర్వాహకుడు భీమనపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

చంద్రపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



చంద్రపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని చంద్రపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ కమ్యూనిటీహాల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పి.సోమిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎవీఆర్ ప్రసాద్, కోశాధికారిగా ఎం.మోహన్‌రావు ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన భీంరెడ్డి, టీఎల్ఎన్ శర్మ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీలోని సమస్యలను పరిష్కరించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం ఆరాధనలు



ఊరేగింపులో పాల్గొన్న దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి చిన్నారులు



అక్బర్‌బాగ్ సెయింట్ పీటర్ లూథరన్ చర్చిలో..

మలక్‌పేట: నియోజకవర్గ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి, మూసారంబాగ్ బేతనీయ చర్చి, అక్బర్‌బాగ్ సెయింట్ పీటర్ లూథరన్ చర్చిలలో మట్టల ఆదివారం(పామ్ సండే)ను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా చిన్నారులు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ యేసుక్రీస్తును ఆరాధించారు. పూలతో అలంకరించిన ఈత మట్టలను ప్రదర్శిస్తూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ పండుగ ఈస్టర్ ముందు ఆదివారం రోజున వస్తుందని, జెరూసలేంలోకి క్రీస్తు విజయవంతమైన ప్రవేశాన్ని జ్ఞాపకం చేస్తుందని పాస్టర్లు తెలిపారు. బైబిల్‌లోని నాలుగు సువార్తలలో ప్రతిదానిలో ఈ విషయం ప్రస్తావించబడిందని వారు పేర్కొన్నారు.

రేపు ఎన్టీఆర్‌నగర్‌లో ధర్మభిక్షం వర్ధంతి

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పేదల పాలిట కల్పవృక్షం ధర్మం తప్పని కామ్రేడ్ ధర్మ భిక్షం 13వ వర్ధంతి కార్యక్రమం ఈ నెల 26న ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో నిర్వహిస్తున్నట్లు వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్‌కేపురం డివిజన్ కన్వీనర్ మహమ్మద్ ఇస్మాయిల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగా చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జంగయ్య ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శ్రీను తదితరులు హాజరవుతారన్నారు.

మన్సూరాబాద్‌లో కాముని దహనం



మన్సూరాబాద్ చౌరస్తాలో కాముని దహనం నిర్వహిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: హోలీ పండుగ సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం రాత్రి మన్సూరాబాద్ చౌరస్తాలో సాంప్రదాయబద్ధంగా కాముని దహనం నిర్వహించారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరై కాముని దహనం చేపట్టారు. హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ డివిజన్ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేతలు



సీఎంను సత్కరిస్తున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ నేతలతో కలిసి ఆదివారం సీఎం నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. సీఎంను కలిసిన వారిలో యాకుత్‌పురా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోట్ల లడ్డూ పటేల్ ఉన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 21, దొండ 28, ఆలు 25, ఉల్లి 19, గోకర 35, దోస 17, సొర 9, పొట్ల 18, అరటి 9, చిక్కుడు 50, అర్వి 28, మునగ 28, చిలగడదుంప 65, బీట్‌రూట్ 21, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యాప్సికమ్ 70. సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్: బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా పరిషత్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ నోముల కృష్ణాగౌడ్ కాంగ్రెస్ గూటికి చేరారు. ఆయనతో పాటు తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు కీర్తనారెడ్డి, మాధవి.. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పెద్ద సంఖ్యలో నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం అన్నారు. కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు.

యోగా షెడ్ ఏర్పాటుకు చర్యలు: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన వాకింగ్ అసోసియేషన్ సభ్యులు

మన్సూరాబాద్: మహావీర్ హరిణి వనస్థలి జాతీయ పార్కు మన్సూరాబాద్ వైపు గేట్ లోపల ఉన్న వాకింగ్ ట్రాక్ వద్ద యోగా షెడ్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు చేపడతానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వాకింగ్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి యోగా షెడ్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్కులోని సమస్యలను పరిష్కరించి వాకర్స్‌కు వసతులు కల్పిస్తామన్నారు. అసోసియేషన్ నేతలు విక్రమ్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, పోచబోయిన జగదీష్‌యాదవ్, నర్సింహులు, జగన్మోహన్‌రెడ్డి,విశ్వనాథ్, శంకర్, కృష్ణ, కొలను శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో కేంబ్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



పెయింటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కేంబ్రిడ్జ్ విద్యార్థులు

సైదాబాద్: కరణ్‌బాగ్ కాలనీలోని కేంబ్రిడ్జ్ పాఠశాల విద్యార్థులు ఇంట్రా స్కూల్ పెయింటింగ్ పోటీల్లో చక్కటి ప్రతిభ చూపి నగర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం నగరంలోని నివేదిత పాఠశాలలో జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్, ది హిందూ యంగ్ వరల్డ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్ విభాగంలో కేంబ్రిడ్జ్ పాఠశాలకు చెందిన జి.దైత్యనాయుడు, సీహెచ్.హారిక, డి.నిక్షేత చక్కటి ప్రదర్శనతో నగర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నిర్వాహకులు వారికి పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. నగర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కేంబ్రిడ్జ్ విద్యా సంస్థల అధిపతి కె.శంతన్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.ఝాన్సీ అభినందించారు.

పిచ్చుకలను కాపాడుకుందాం



పిచ్చుకగూళ్లు, నీటితొట్టెలు పంపిణీ చేస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం సభ్యులు

ఎల్‌బీనగర్: మానవుల మనుగడ సృష్టిలోని ఇతర జీవులతో ముడిపడి ఉందని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం, సామాజిక కార్యకర్త గద్దె విజయ్‌నేత ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలో ఆదివారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీవాసులకు పిచ్చుక గూళ్లు, వాటి నీటి కోసం మూకుళ్లు, వీధి జంతువుల కోసం నీటి తొట్టెలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భావన శ్రీనివాస్ మాట్లాడుతూ, పిచ్చుకలు మన ఆహార పంటలను ఆశించే చీడ పురుగులు, క్రిమి కీటకాలను తినేసి పంటలను కాపాడతాయన్నారు. పిచ్చుకలు కిచ కిచ మంటూ మన ఇంటి చుట్టూ తిరుగుతూ సందడి చేస్తుంటే పిల్లలు సంతోషంతో మైమరిచిపోతారని అన్నారు. పర్యావరణానికి ఎంతో మేలు చేసే పిచ్చుకలు నేడు అంతరించు పోతున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

◆ వేసవిలో వీధి జంతువుల దాహార్తిని తీర్చేందుకు అన్ని కాలనీ వాసులకు ఉచితంగా నీటి తొట్టెలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో భద్రారెడ్డి, కామేష్, మనోజ్ కుమార్, దుర్గాప్రసాద్, రాంబాబు, శశి, జైపాల్‌రెడ్డి, సూర్యకుమారి, రమేష్, ఉపేందర్ , మధు, ఉదయ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి

నాగోలు: ఇళ్లల్లో నీటి వృథా కాకుండా చూసుకోవాలని, వర్షా కాలంలో నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు నిర్మించాలని జలమండలి డైరెక్టర్ శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నాగోలు డివిజన్ చాణిక్యపురి కాలనీలో సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జలమండలి సహకారంతో నీటి సంరక్షణ- వినియోగంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, కాలనీలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జలమండలి ఇంకుడు గుంతల స్పెషల్ అధికారి జల సత్యనారాయణ మాట్లాడుతూ, వాన నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతి కాలనీలో ఇంటింటా ఇంకుడు గుంతలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జలమండలి నాగోలు డివిజన్ మేనేజర్ అర్చన మాట్లాడుతూ.. ఈ వేసవిలో కాలనీలో నీటి కొరత రాకుండా చూస్తామన్నారు. కమ్యూనిటీ హాల్‌లో ఉన్న ఇంకుడు గుంతను పునరుద్ధరించారు. అనంతరం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి మొబైల్ యాప్ ద్వారా ఇంకుడు గుంతల స్థితి గతులపై సర్వే చేశారు. కార్యక్రమములో సీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నాగ బ్రహ్మాచారి, శ్రీధర్, లోకేష్, కాలనీ వాసులు నర్సింహారెడ్డి, మధుసూదర్ రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.



నీటిని కాపాడుతామని కాలనీవాసులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జలమండలి అధికారులు

వైభవంగా విజయ చాముండీ హోమం



హస్తినాపురం: డివిజన్ పరిధి డిఫెన్స్ కాలనీలోని శ్రీహరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఐదవ రోజు విజయ చాముండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఆలయ వ్యవస్థాపకుడు, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, గడ్డం మంగారెడ్డి, నద్ది సందీప్‌రెడ్డి, అంకల రమేష్‌రెడ్డి, లింగాల దశరథ్‌గౌడ్, విజ్ఞేశ్వర్ రెడ్డి, అంజయ్యగుప్తా, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించడం సంప్రదాయం

ఎమ్మెల్యే సబితా రెడ్డి



ఎమ్మెల్యే సబితా రెడ్డిని సన్మానిస్తున్న నిరంజన్

పహాడీషరీఫ్: పెద్దలను గౌరవించడం సంప్రదాయమని, విద్యార్థులకు చదువుతో పాటు విలువలను కూడా నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయలపై ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని శ్రీ హర్ష పాఠశాల వార్షికోత్సవంలో శనివారం రాత్రి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ శ్రీరాం కాలనీలోని పేద, మధ్య తరగతిని దృష్టిలో ఉంచుకొని లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో విద్యనందించాలన్నారు. విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉప్పుమూరి నిరంజన్, కరస్పాండెంట్ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న, డీస్ కృష్ణారెడ్డి, జల్‌పల్లి కో-ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మహేశ్వరం: మాల, బ్యాగరి కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో శ్మశానవాటికలను కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రతి కాటికాపరికి ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కనీస వేతనం రూ. 25వేలు, ఒక్కొక్కరికి రూ.10 లక్షల బీమా కల్పించాలన్నారు. తమ సమస్యలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చాలని కోరారు. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని మల్లు రవి అన్నారు. బ్యాగరి కాటికాపరుల జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవులు, జిల్లా అధ్యక్షుడు గాదె సత్తయ్య, శేఖర్, నగేశ్, మద్దిలేటి, నాగరాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సట్టా నిర్వాహకుల అరెస్టు

చంచల్‌గూడ: పాతబస్తీలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సట్టా స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే... మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలోని చావణీ బాగే జారాలో కొందరు సట్టా నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. సట్టా నిర్వాహకులు మహ్మద్ అబ్దుల్ ఖాదీర్(73), మహ్మద్ ఇమ్రాన్ (32) పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి రూ.97,490 నగదు, ఒక ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మహారాష్ట్రకు చెందిన మినాజ్‌తో ఆన్‌లైన్‌లో సట్టా నిర్వహిస్తున్నట్లు నిందితులు అంగీకరించారని పోలీసులు తెలిపారు. గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 140 డబుల్ బెడ్రూమ్స్ పక్కన ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేసి ప్రీకాస్ట్ గోడను నిర్మించారు. ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసుల సహాయంతో జేసీబీలతో అక్రమ నిర్మాణాలను తొలగింపజేశారు. అనంతరం ఆర్డీఓ సూరజ్ కుమార్ మాట్లాడుతూచ మన్సాన్‌పల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 140లోని భూమి మొత్తం ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటివారికైనా చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలానికి చెందిన కొందరు చేసిన ఫిర్యాదు మేరకు తాము అప్రమత్తమై అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశామన్నారు.